ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 01 మే, 2026 | పేజీలు : 06

## బస్సు షెల్టర్ నిర్మాణంలో ఉద్రిక్తత



వివరాలు మెయిన్‌లో...

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిరంతర పర్యవేక్షణ

### బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

**ప్రజాపక్షం/చిగురుమామిడి:**చిగురుమామిడి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా ఎమ్మార్వో, ఎంపిడివో, ఏఈవోలు నిరంతర పర్యవేక్షణ చేయాలని బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిగురుమామిడి మండలంలో తదితర అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా 7 తహసీల్దార్, 7 ఎంపిడిఒ, 7 వ్యవసాయ అధికారి ఇంచార్జిగా ఉంటారని, మొత్తానికి డిపివో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొంతులపల్లి లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్ సమస్యల్లో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పాత బావులు, పూడికతీత చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. సుందరగిరిలో ఇప్పటికే వేసిన బోరుకు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంపై విద్యుత్ అదికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నీటి వనరులు ఉన్న బావుల నుంచి పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. కొత్తపల్లి హుస్నాబాద్ మద్య నిర్మిస్తున్న నాలుగు లేన్ రోడ్డులో పైప్‌లైన్ ఎందుకు షిఫ్ట్ చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం వస్తే పనులకు ఆటంకాలు ఎదురవుతాయన్నారు. బడిబాట ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అదికారులను ఆదేశించారు. చిగురుమామిడి మండలంలో అన్ని పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వనమహోత్సవం ద్వారా లక్ష్యానికి మించి అదనంగా ప్లాంటేషన్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ వేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై పని ప్రారంభం కాని 9 ఇళ్లు నోటీసులు ఇచ్చి రద్దు చేయాలని ఆదేశించారు. 193 ఇల్లు స్లాబ్ వరకు పూర్తికాగా జూన్ 2 లోపు భారీగా ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం జరగాలని హౌజింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలో 280 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని, రైతులకు హార్టికల్చర్ అదికారులు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని, ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, డిపివో జగదీశ్వర్, డిఆర్‌డివో శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్, బిసి వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాష్ తదితరులున్నారు.






### విద్య, వైద్యం, సాగునీరుకు పెద్దపీట

చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ఇబ్బందులు రావద్దన్నారు. అధికారులతో కలిసి సమన్వయం చేసుకోవడానికి ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కలిసి కమిటీలు వేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో తాగు నీటి సరఫరాలో సమస్యలు రావద్దన్నారు. ఆయా గ్రామాల్లో శాశ్వత పరిష్కారం చేయాలని చెప్పారు. బావుల పూడికతీత, పైప్‌లైన్ వేయడం, తదితర అంశాలపై పరిష్కారం చూపడానికి ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలు వేశారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కాగానే బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో విధ్యార్థుల సంఖ్య పెంచేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తామని చెప్పారు. పాఠశాలల్లో డ్రాప్ ఔట్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయా పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఆకర్షమైన రంగులు వేయడం, విధ్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం, టీచర్ల కొరత లేకుండా చూడడం బాధ్యత ప్రభుత్వానిదన్నారు. వర్షాకాలంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి మండలంలో ప్రతి గ్రామాల్లో పచ్చని చెట్లతో సుందరంగా ఉండాలని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అందుకు ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తున్నామని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆద్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు తదితర అంశాల సమస్యలపై కమిటీ సభ్యులు చర్చించుకోవాలన్నారు. బిజెపి ప్రభుత్వం సర్ పేరుతో కాంగ్రెస్ సానుభూతి పరుల ఓట్లు తొలగిస్తున్నారని, ప్రతి బూత్‌కు ఒక బిఎల్ఏను నియమించి సర్ ఓటరు సవరణ ప్రక్రియలో ఓట్లు పోకుండా దొంగ ఓట్లు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మండలాల్లో, గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి కాంగ్రెస్ మండల అద్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు సాంబార్ బాబు, దేవేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పోలు స్వప్న, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు , ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య కార్యకర్తలున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో సర్కారు పూర్తిగా విఫలం



వివరాలు మెయిన్‌లో...

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



వివరాలు మెయిన్‌లో...

## పౌర హక్కుల దినోత్సవం




**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని దేవికొండ గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నామ సురేందర్ రావు, ట్రైనీ డిప్యూటీ తహశీల్దార్ సాయి చరణ్ మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలగాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు మరియు చట్టాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను పారద్రోలి, గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి జమున, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి కె ప్రవీణ్, ఏఈఓ, జీపీఓ నరేష్,హెల్త్ సూపర్ వైజర్ ద్వారక, వీఓఏలు, ఆశాలు,పంచాయతీ సిబ్బంది ,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేసిన కోరుట్ల మున్సిపల్ కమిషనర్

### పడకేసిన కోరుట్ల మున్సిపాలిటీ స్విపింగ్ యంత్రం




**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల మున్సిపాలిటీ స్విపింగ్ యంత్రం రెండు సంవత్సరాలు గడుస్తున్న వాటికి రిపేర్ అనే సాకుతో మూలన పడేశారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దుమ్ము ధూళిలో మట్టిలో కలిసిపోతుంది. లక్షల ప్రజాధనం వెచ్చించి తెచ్చిన స్విపింగ్ యంత్రాన్ని మట్టిలో కలిపారా అధికారులు? అనే ప్రశ్న కోరుట్ల పట్టణ ప్రజలలో ప్రశ్నార్థకంగా మారింది.స్విపింగ్ యంత్రానికి రిపేర్ అనే సాకుతో మూలన పడేసిన అధికారులు యంత్రానికి వచ్చిన రిపేరా లేక అధికారులు చేసిన నిర్వాహకమా అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. లక్షల ప్రజాధనం అంటే మామూల..? ప్రజలు చెమటోడ్చి కట్టే పన్నుల సొమ్ముతో లక్షలు వెచ్చించి తెచ్చిన వాహనాన్ని నిర్లక్ష్యంతో తుప్పు పట్టించి మట్టిలో కలిపేస్తున్నారు. కోరుట్ల మున్సిపల్ అధికారులు అవినీతిలో నంబర్ వన్ గా నిలుస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిరోజు కమిషనర్ పై ఏదో ఒక సందర్భంగాపై ఆరోపణలు వస్తున్న జిల్లా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**వివరాల్లోకి వెళ్తే :**కోరుట్ల మున్సిపాలిటీలో 50 లక్షలు అక్షరాల యాభై లక్షలు ఖర్చు చేసి తెచ్చిన స్విపింగ్ వాహనం ప్రధాన రహదారులపై దుమ్ము దూళి చెత్తను ఊడ్చేది వాటిలో చిన్నపాటి సాంకేతిక లోపం వల్ల ఆ వాహనం రిపేర్ కు రావడంతో ఆ యంత్రాన్ని పక్కకు పడేశారని మున్సిపల్ సిబ్బంది చెప్తున్నారు. ఈ వాహనంతో కనీసం 50 మంది కార్మికులు చేసే పనిని ఈ ఒక్క యంత్రం చేస్తుందని ఆ వాహనాన్ని కోరుట్ల ప్రజలు కట్టిన పన్నుల డబ్బు,ప్రభుత్వ ధనంతో కొనడం జరిగింది కానీ కోరుట్ల మున్సిపల్ అధికారులు మాత్రం వాటిని లెక్కచేయకుండా అధికార దుర్వినియోగం చేస్తున్నారా లేక నిర్లక్ష్యంతో వాటిని తుప్పు పట్టించి మట్టిలో కలిపేస్తున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగర పరిశుభ్రత కరువు ప్రజల డబ్బును వృధా చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరమ్మత్తులు చేసి వాటిని వినియోగంలోకి తేవాలని కొత్త పాలకవర్గాన్ని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రజలు పన్నులు కట్టకపోతే వారిపై దురుసుగా ప్రవర్తించే అధికారులు వారు అధికార దుర్వినియోగం, ప్రజాధనాన్ని స్వాహా చేస్తుంటే ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్, ఆర్డిఓ వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత కమిషనర్ అంటేనే కమిషన్లకు కక్కుర్తి పడే అధికారి అని ప్రజలు సామాజిక కార్యకర్తలు ప్రతిరోజు సోషల్ మీడియాలో వీరిపై అనేక ఆరోపణలు చేస్తున్న కోరుట్ల మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కోరుట్ల మున్సిపల్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారేమో అని వేచి చూడాలి.

**చెన్న విశ్వనాథం:** సిపిఐ జిల్లా కార్యదర్శి. ప్రధాన రహదారులను ఊడ్చే స్విపింగ్ యంత్రాన్ని లక్షలు వెచ్చించి తెచ్చి రిపేర్ అనే సాకుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై ఉన్నత అధికారులు,కొత్త పాలకవర్గం,చర్యలు తీసుకోని ఆ వాహనాన్ని వినియోగంలోకి తేవాలని కోరారు.

## మెట్‌పల్లి నూతన జడ్జిగా వి. మాధవి

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి నూతన జూనియర్ సివిల్ జడ్జిగా వినుకొండ మాధవి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నారం అరుణ్ కుమార్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లుకు బదిలీ చేయగా,ఖమ్మం జిల్లా మూడవ అదనపు కోర్టు మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న మాధవి మెట్‌పల్లి కోర్టుకు బదిలీపై వచ్చారు.పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.మాజీ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్,క్రీడా కార్యదర్శి నీరటి రమణ,జూనియర్ ఈసీ సభ్యురాలు మాలే పు సంధ్యారాణి,న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, చైతన్య, సత్య నారాయణ ,మన్నె గంగాధర్, పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎఎంసి చైర్మన్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ అన్నారు .గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో చందోలి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ తో కలిసి ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు దతు ధర లభిస్తుందన్నారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని,దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,స్థానిక సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్,ఉప సర్పంచ్ దీటి మహేష్,పిఎసిఎస్ మాజీ చైర్మన్ మాధవ రావు ,ఫాక్స్ సీఈఓ ఆఫీజ్, దట్నూర్ సర్పంచ్ బెక్కం గంగయ్య ,భీం రాజ్ పల్లె సర్పంచ్ గంగాచారి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్క రాజయ్య ,వార్డు సభ్యులు చొప్పదండి చంద్రయ్య ,తాండ్ర స్వామి,కంపెల్లి మనీషా శ్రీకాంత్, తోట్ల సంధ్యారాణి సురేష్,బద్రి రవి,చెందోలి మాజీ సర్పంచ్ పల్లెర నారాయణ , గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండి బుజ్జన్న,పాక్స్ మాజీ డైరెక్టర్ సికింకంతం నాగయ్య, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మజ్జు,నడిపి గంగయ్య, మాజీ ఎంపీటీసీ మహబూబ్ ,కడ మొగిలి , తాండ్ర తిరుపతి,సయ్యద్ షకీల్,గడ్డి కొమురయ్య ,గర్వంధుల కనుకయ్య,భంగి శివకుమార్,తోట్ల బుచ్చన్న ,వితల లక్ష్మణ్ ,ఖలీద్ పాషా,నక్క రాజ్ కుమార్, గడ్డి,రాజేష్,చందు,మహేష్,తిరుపతి ,శ్రీకాంత్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు ఘన సన్మానం




**ప్రజాపక్షం/రామగిరి:**గురువారం జి.ఎం.కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన ఏరియా సర్వే అధికారి డి.జనార్ధనరెడ్డి, సివిల్ విభాగం జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.రాధాకిషన్ రావు, లను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, తోపాటు అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జి.ఎంలు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో పనిచేసిన వీరు సంస్థ పట్ల విధేయతతో, అంకిత భావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి,అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటుజిఎం బి.వి.సత్య నారాయణ,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ,రాజేంద్ర కుమార్, షబ్బీరుద్దీన్,సి.జె.సురేఖ,ఆర్.రాజేశ్వరి, రవి చరణ్ తోపాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో 20 ఏళ్ల పాత సామగ్రి ఏమైనట్టు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మొగిలిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గత 20 ఏళ్లుగా స్క్రాప్ గా మిగిలిన ఉన్న పాత సామాగ్రి ఏమైందని మాజీ సర్పంచ్ వనత డుపుల నాగరాజు ఆర్టిఐ దరఖాస్తు ద్వారా పంచాయతీ కార్యదర్శిని కోరారు. 20 సంవత్సరాలుగా కుర్చీలు బీరువాలు సైకిల్ రిక్షాలు పాత మోటర్లు గేట్ వాల్ బోరింగ్ పైపులు మొదలైనవి స్క్రాప్ గా ఉన్నాయని ప్రస్తుతం అవి కనబడడం లేదని వాటి వివరాలు అందించాలని ఆర్టిఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. స్క్రాప్ గా మిగిలి ఉన్న పాత సామాగ్రిని అమ్మినట్లయితే గ్రామపంచాయతీ తీర్మానం, ఉన్నత స్థాయి అధికారుల ఆదేశా పత్రం, అమ్మిన తేదీ వివరాలు,స్క్రాప్ అమ్మగా వచ్చిన ఆదాయం, జమ చేసిన ఖాతా వివరాలు పూర్తిగా ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. కాగా ఈనెల 24వ తేదీన పంచాయతీ కార్యదర్శికి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు అందించినట్లు ఆయన తెలిపారు.

## మైనార్టీ బాలికల పాఠశాల విద్యార్థుల 100%ఉత్తీర్ణత




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పదవ తరగతి ఫలితాలలో స్థానిక పెద్దపల్లి మండలం రంగంపల్లి లోని మైనార్టీ పాఠశాల విద్యార్థినిలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబర్చారనీ పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 56 మంది విద్యార్థినిలు పరీక్షలు రాయగా 56 మంది 100% ఉత్తీర్ణత సాధించారని, వీరిలో మాధురి 570, ప్రవళిక 565, శ్రీదేవి 550 మార్కులు సాధించారని, 34 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులతో ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను, పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ కాస అంజలి గంగాధర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కూలీలందరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతికూలికి పని కల్పించి ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు .వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయాన్నే పనులకు వచ్చి పనులను త్వరగా పూర్తిచేసుకుని ఇంటికి చేరుకోవాలని సూచించారు .ఉపాధి హామీ పనులు గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా గ్రామ అభివృద్ధికి కూడా తోడ్పడుతాయని సర్పంచ్ కాసా అంజలి గంగాధర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మస్క ఆంజనేయులు,గ్రామ కార్యదర్శి విక్రమ్,కడారి కమలాకర్,చిత్తూరు రాజన్న ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి కార్పొరేషన్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో 2005 26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు పొందడానికి ఓ బియమ్ యమ్ ఎస్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మే 2 వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకల వెంకటేష్ ఒక ప్రకటన లో తెలిపారు. స్వయం ఉపాధి రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్టర్ కాపీ, కులం, ఆదాయం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ పోర్టు ఫోటో,విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్, ఒరిజినల్ పత్రాలతో మే 2న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

## ఇటిక్యాలలో పౌర హక్కుల దినోత్సవం

**ప్రజాపక్షం/రాయికల్:** ఇటిక్యాల గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ పద్మయ్య మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కులను తెలుసుకోవాలని వారిని చట్ట ప్రకారంగా వినియోగించుకోవాలని అన్నారు. జిపిఓ శ్యామ్, సర్పంచ్ శ్రీనివాస్ లతోపాటు అంబేద్కర్ యువజన సంఘం నాయకులుపాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** టిపిసిసి డెలిగేట్ సుజిత్ రావు నివాసంలో గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి(సిఎమ్ఆర్ఎఫ్) లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 42 మంది లబ్ధిదారులకు సుజిత్ రావు చేతుల మీదుగా చెక్కులను అందజేశారు.అనంతరం సుజిత్ రావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, రాష్ట్ర ఫిషర్ మెన్ జనరల్ సెక్రటరీ రుత్త నారాయణ, మల్లాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, ఏలేటి వినోద్ రెడ్డి,మాజీ ఎంపిటిసిఅశోక్,యూత్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు సాగర్,కోరుట్ల నియోజకవర్గ యూత్ వైస్ ప్రెసిడెంట్ దీపక్, మామిడి శేఖర్ రెడ్డి,కల్లెడ గంగాధర్,మహేష్, పవన్,సమీర్,రాజు,పాల్గొన్నా రు.

## హనియకు సన్మానం చేసిన పాషా



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 550 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన పట్టణానికి చెందిన వివేకానంద హై స్కూల్ విద్యార్థిని హనియ హోరిన్‌ను కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా ఘనంగా సన్మానించారు.హనియ, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ కుమార్తె. ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ పాషా ప్రశంసలు తెలిపారు.రహిమోద్దీన్, షారు,మజార్,అనస్,అబూజర్,పాల్గొన్నారు.

## 2న కోరుట్లలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ సమావేశం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మే నెల 2 శనివారం రోజు కోరుట్లలోని సి ఎం ఎస్ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ చిప్ప గణేష్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఆశలు,అంగన్వాడీ టీచర్లు, ఐకెపి వీవోలు అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఎంపిడిఒ సూచించారు.

# బాధపడుతున్న ప్రతి ఇంటికీ బాసట

### బిఆర్ఎస్ పార్టీ నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్

### అనారోగ్యంతో బాధపడుతున్న లారీ డ్రైవర్ కుటుంబానికి బాసట



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన ముహమ్మద్ రహీముద్దీన్ గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యాడు. లారీ డ్రైవర్ గా పనిచేసే రహీముద్దీన్ రెక్కడితే గానీ పూట గడవని పరిస్థితి ఉంది. ఓవైపు కుటుంబ భారం, మరోవైపు అనారోగ్య సమస్యలు ఆర్థికంగా రహీముద్దీన్ కుటుంబాన్ని కుంగ దీశాయి. మనోధర్యం కోల్పోయిన రహీముద్దీన్ దీన గాధను తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పార్టీ శ్రేణులతో గురువారం పవర్ హౌస్ కాలనీలోని రహీముద్దీన్ ఇంటికి వెళ్లారు. కంటి నిండా దుఃఖంతో ఉన్న రహీముద్దీన్ కు బాసటగా ఉంటానని ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులకోసం పదివేల ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యాన్ని కల్పించారు. మాటలతో కాకుండా చేతలతో తన వంతు సహకారాన్ని అందిస్తూ హరీష్ రెడ్డి తనకంటూ ఓ ప్రత్యేకతను సాధిస్తున్నారు. ఇదే క్రమంలో వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, అనాథలకు తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. తనకు ఉన్న దాంట్లో నలుగురికి పంచడమే భాగ్యం అంటూ ప్రజాసేవలో ప్రత్యేక మార్కు సాధిస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో బాధతప్త కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.గురువారం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొలాడి శ్రీనివాస రావు, బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి,నూతి రాజ్ కుమార్,తదితరులు ఉన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు షీ టీం, భరోసా టీం సంయుక్తంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలలో అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది మహిళలు,పిల్లలు వేధింపులకు గురైనప్పుడు వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు.మహిళా హక్కులు, భద్రతకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టంపై వివరించారు. లింగ సమానత్వం ప్రాముఖ్యతను తెలియజేసి,సమాజంలో ప్రతి ఒక్కరిని గౌరవంగా చూడాలని సూచించారు.సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ వినియోగం, మద్యపానం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఉన్నారు.

## సమష్టి కృషితో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలి




**ప్రజాపక్షం/రామగిరి :** నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధించాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.గురువారం రామగుండం3 ఏరియాలోని ఓసిపి2 ఉపరితల గని 2వ షిఫ్ట్ (బదిలీ) లో నిర్వహించిన కార్యక్రమంలో రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ పాల్గొని ఉద్యోగులను ఉద్దేశించి మాట్లడుతూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో అందరం భద్రతతో విధులు నిర్వహిస్తూ, నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని, రోజుకు సుమారు 30 లక్షల క్యూబిక్ మీటర్లు ఓ.బి మట్టి వెలికి తీయాలని,అలాగే సుమారు 12 వేల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా చేయాలని మే, జూన్ వేసవి కాలంలో ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సహాయ సహకారాలు అందించాలని, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. అనంతరం పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, రామిండ్ల మనోహర్,ప్రాజెక్ట్ ఆఫీసర్ జె. రాజశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్ర శేఖర్,ఇంచార్జ్ మేనేజర్ సంపత్ కుమార్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,అడిషనల్ మేనేజర్ జి.మహేష్ ఇతర అధికారులు,ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందన



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు బుధవారం విడుదలైన ఫలితాలలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం పలువురు విద్యార్థులను శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.భవిష్యత్తులో చదువుల్లో మరింతగా రాణించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దేల నరసయ్య, వార్డు సభ్యులు అమీన్, లస్మయ్య, నాయకులు సురేష్ శేఖర్ భూమారెడ్డి స్వామి భాస్కర్ రాజు సంతోష్ రాము రషీద్ రాజ రెడ్డి వెంకట్ రెడ్డి భాస్కర్ మహేష్, గంగా నరసయ్య ,రాజు,తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబాబు అనే మేస్త్రి గత కొన్ని రోజులుగా కుమ్మరిపెల్లి లో నివాసం ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రోజులాగే తన దగ్గర పని చేసే కూలీలకు ఆహారం అందించేందుకు కుమ్మరిపల్లి నుండి తన కారు లో బయలుదేరగా కొద్ది దూరంలోనే కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/రాయికల్ :** గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని జగిత్యాల డిఆర్డీవో రఘువరణ్ అన్నారు. గురువారం రాయికల్ మండలంలోని రాజనగర్ గ్రామంలో ఖండిత కంధకాల పనులు,గ్రామ వన నర్సరీ, గ్రామైఖ్య సంఘం భవన నిర్మాణాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు.పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేసి ప్రభుత్వం ఇస్తున్న వేతనం పొందాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటల వరకు పనుల్లోకి రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బింగి చిరంజీవి,సర్పంచ్ భారతపు రాజేష్,ఏపీవో దివ్య, టెక్నికల్ అసిస్టెంట్లు విజయ్,రాజేందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటాచలం,ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్,కూలీలు,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

**ప్రజాపక్షం /పెగడపల్లి :** ప్రస్తుత సమాజంలో యువత మరియు సామాన్య ప్రజలు మత్తు పదార్థాలకు మరియు సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి ఎస్ఐ ఈ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలని,వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ తెలపకూడదని సూచించారు. అలాగే గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని, వాటికి దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఘన సన్మానం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం కోనరావుపేటస్థానిక జెడ్‌పిహెచ్ఎస్ హై స్కూల్ లో పదో తరగతి పరీక్షల్లో 556 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఏనుగందుల వనజను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా పాఠశాల ఈ విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఉపాధ్యాయులు,విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల బోధన ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్ జక్కని పరంధాములు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మారు సాయిరెడ్డి పాల్గొని విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిడిఒ

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక పేట గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో చిప్ప గణేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లతోపాటు మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్,పంచాయతీ కార్యదర్శి సరితలను ఆదేశించారు.ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో గణేష్ సూచించారు.

## నాయిని చెరువు మత్తడిని సందర్శించిన డిఇ

**ప్రజాపక్షం/జమ్మికుంట:**జమ్మికుంట పట్టణ పరిధిలోని నాయిని చెరువు మత్తడినీ ఇరిగేషన్ డిఈ మున్సిపల్ ఏఈ తో కలిసి సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న వర్షాకాలం దృశ్య జమ్మికుంట పట్టణం నుండి వస్తున్నటువంటి వరదనీరు పట్టణ ప ప్ర వహిస్తున్న సమయంలో వరద నీరుకు అడ్డుగా ప్రవహించడం వల్ల వరద నీరు మత్తడి వైపు నెమ్మదిగా ప్రవహించడం జరుగుతుంది. తద్వారా చెరువు సంబంధిత పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి గృహ నివాసులకు వరద నీరు ఇబ్బంది కలిగించేలా ఉంటుంది కావున చెరువు మత్తడినీ నీరు వరద నీరు వేరువేరుగా వెళ్ళడం కోసం ఒక రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం సందర్శించడం జరిగిందని అని తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన ఎం ఈషా నందినిని, మంచి ఫలితాలు సాధించేలా కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపల్ డా.కె అశోక్ తో పాటు ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పీడీ ప్రతాప్ కుమార్, ఉపాధ్యాయులు రామస్వామి, మల్లేశం, రామచంద్రం, మహేష్‌లు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి నూతన సీఐ సురేష్‌బాబుకు ఘనసన్మానం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌బాబును జగిత్యాల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎశమేని గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ నాయకుడు ఎండి ఉస్మాన్‌తో పాటు హమాలి సంఘం నాయకులు కాశీపాక శంకర్,జి. నూతన బాధ్యతలు స్వీకరించిన సీఐ సురేష్‌బాబు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విజయవంతం కావాలని నాయకులు ఆకాంక్షించారు.

## ముత్తారంలో ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల ఎంపిక కోసం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.మండల పరిషత్ అధికారి సురేష్ వివిధ బ్యాంక్ మేనేజర్లతో కలిసి ఈ ఇంటర్వ్యూలను చేపట్టారు.నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేసి, బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు,మండల పరిషత్ సిబ్బంది,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పేద బాలిక వైద్యం కోసం రూ.1.20 లక్షలు సాయం

**ప్రజాపక్షం/ధర్మపురి :** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ నిరుపేద విద్యార్థినికి వైద్యం కోసం ఫేస్ బుక్ మిత్రులు రూ.1.20 లక్షలు విరాళాలు అందించారు.వివరాలు ఇలా ఉన్నాయి.జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తుమ్మెనాల గ్రామానికి చెందిన లింగమల్ల లక్ష్మణ్, సుమిత్ర దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉండగా చిన్న కూతురు శ్రీహిత ప్రభుత్వ మోడల్ కాలేజ్ లో ఇంటర్ చదువుతుంది.గత 5 నెలల క్రితం అనారోగ్యానికి గురైంది.తండ్రి లక్ష్మణ్ గ్రామ పంచాయతీలో వాటర్ సప్లయర్ గా కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూ,చిరు వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు వైద్యం కోసం తండ్రి లక్ష్మణ్ అప్పులు చేసి 3 లక్షలు ఖర్చు చేశాడు.ఇంకా కొన్ని నెలలు వైద్యం అందించాల్సి ఉండగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ధర్మపురి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట



రమేష్ ఏప్రిల్ 3 న ఫేస్ బుక్ పోస్ట్ చేసి వైద్యం కోసం సాయం అందించాలని కోరాడు.ఎన్నారైలు స్పందించి రూ.1.20 లక్షలు లక్ష్మణ్ బ్యాంకు ఖాతాకు పంపించారు.సదరు విరాళాల నుండి ప్రస్తుత వైద్య ఖర్చులకు కొంత మొత్తాన్ని ఎస్బిఐ బ్యాంక్ అధికారులతో గురువారం లక్ష్మణ్ దంపతులకు రమేష్ పంపిణీ చేయించాడు.

# వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

-ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు సూచించారు.ఆయన ఆదేశాల మేరకు గురువారం మండలంలోని మచ్చుపేట గ్రామపంచాయతీ పరిధిలోని శుక్రవారం పల్లె గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆరోగ్య సిబ్బంది సందర్శించారు.ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి, ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

**ప్రభుత్వ వైద్యుడి సూచనలు :** నీరు తప్పనిసరి దాహం వేయకపోయినా రోజుకు కనీసం 5 లీటర్ల నీరు తాగాలి.శరీరంలో నీటి శాతం తగ్గకుండా కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ,ఓ ఆర్ఎస్ వంటివి తీసుకోవాలి.

**ఆహార నియమాలు :** సులభంగా అరిగే ఆహారం తీసుకోవాలి. పుచ్చకాయ, దోసకాయ, నారింజ వంటి పండ్లకు



ప్రాధాన్యత ఇవ్వాలి. కారం, మసాలా పదార్థాలను తగ్గించాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, సన్‌గ్లాసెస్ తప్పనిసరిగా వాడాలి.ఎండ నుండి రాగానే వెంటనే చల్లటి నీళ్లు తాగకూడదు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాతే నీరు సేవించాలి. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ గ్రేస్ మని, హెల్త్ అసిస్టెంట్ మిట్ట శ్రీనివాస్,ఫీల్డ్ అసిస్టెంట్ రాజు కుమార్,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# బి.ఆర్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని భీమ్ రాజ్ పల్లి గ్రామ శివారు మైదానంలో భీమ్ రాజ్ పల్లి (బి ఆర్ పి ఎల్)క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, బి.బి.కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి టాస్ వేసి, టెంకాయ కొట్టి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం జరిగిన తొలి మ్యాచ్‌లో లక్ష్మీపూర్,దమ్మన్నపేట జట్లు తలపడ్డాయి.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. ఈ రోజుల్లో యువత తప్పుడు మార్గాల్లో చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. కానీ ఇలాంటి క్రీడా మైదానాల్లో గడిపే సమయం మిమ్మల్ని ఆరోగ్యవంతులుగా సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దుతుంది. వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని సూచించారు.బహుమతుల వివరాలు:విన్నర్ ప్రైజ్: రూ. 10,016/ (సర్పంచ్ కొలగాని శ్రీలత గంగ చారి )రన్నర్ ప్రైజ్: రూ. 5,116/ (ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ,



బి.బి.కె ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన కుమార్)ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలగాని శ్రీలత, బి బి కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన కుమార్, సర్పంచులు దాసరి తిరుపతి గౌడ్,కాసం రాజశేఖర్, ఉప సర్పంచ్ బొమ్మెన రాజమ్మ,లావణ్య తిరుపతి, మహేష్,, వార్డు సభ్యులు దీవెన,బాబు,రేవల్లే కొమురయ్య, సాగర్,తిరుపతి రెడ్డి,నాయకులు సింగారపు లచ్చయ్య,మహేష్, జనార్ధన్,క్రీడాభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా సిఎం రిలీఫ్ ఫండ్ చేయూత

టిపిసిసి డెలిగేట్ సుజిత్ రావు

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామానికి చెందిన గుంటి భూమక్కకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కును టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు గురువారం తన నివాసంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలకు అండగా నిలుస్తుందని తెలిపారు. అనారోగ్యం,ప్రమాదాల సమయంలో చికిత్స ఖర్చులు భరించలేని వారికి ఈ నిధి తక్షణ సహాయం అందిస్తుందన్నారు.కూన గోవర్ధన్, వాకిటి సత్యం రెడ్డి, కొమ్ముల చిన్నారెడ్డి, నల్లూరి సాగర్, రూత్త



నారాయణ, అమ్ముల పవన్, వినోద్, మిట్టపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారురాలు భూమక్క ప్రభుత్వం అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/జమ్మికుంట:**మెప్మా ఆధ్వర్యంలో స్థానిక వినాయక గార్డెన్ గురువారం ‘ఉద్యమ్ రిజిస్ట్రేషన్’ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో, టీఎల్ఎఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కరీంనగర్ పిడి స్వరూప రాణి, మున్సిపల్ చైర్ పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, వ్యాపార సంస్థల పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌ను ప్రాతిపదికగా తీసుకుని వాటిని వర్గీకరిస్తూ, వ్యాపార లావాదేవీలను సులభతరం చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి యంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ద్వారా శాశ్వత గుర్తింపు పొందాలని వారు సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, చిరు వ్యాపారులు దీనిని వినియోగించుకోవాలని కోరారు. వ్యాపార రంగంలో పారదర్శకత, ప్రభుత్వ చేయూత అందాలంటే ప్రతి చిన్న, మధ్య తరహా పరిశ్రమ తప్పనిసరిగా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, డీపీఎం సతీష్, ఇంచార్జి టి.ఎం.సి. మల్లీశ్వరి, సీఎల్ ఆర్పీలు మంజుల, జ్యోతి, ఆర్పీలు, ఓబీలు పలువురు పాల్గొన్నారు.

## శాతవాహన వాణిజ్య కళాశాలలో పరిశోధక విద్యార్థినికి పిహెచ్‌డి పట్టా

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**శాతవాహన విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో స్మిత మహీంద్రాకర్ పరిశోధక విధ్యార్థి వర్కింగ్ ఆఫ్ యూపిఐ సిస్టం ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పిహెచ్‌డి మౌఖిక పరీక్షను పూర్తి చేసుకుని డాక్టరేట్ పట్టాను డాక్టర్ డి.హరికాంత్, కామర్స్ విభాగాధిపతి పర్యవేక్షణలో పూర్తి చేశారు. కామర్స్ విభాగంలో సమాజానికి ఉపయోగపడే ఒక మంచి అంశంపై పరిశోధన జరిగిందని డాక్టర్ డి.హరికాంత్ స్మితను అభినందించారు. శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్, రిజిస్టర్ ప్రొఫెసర్ పెద్దపల్లి సతీష్ కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. స్మిత కామర్స్ విభాగంలో వర్కింగ్ ఆఫ్ యూపిఏ సిస్టం ఇన్ తెలంగాణ ఏ స్టడీ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను పిహెచ్‌ఢి లభించిందని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు.

## ఘనంగా లక్ష్మి నరసింహ స్వామి ప్రతిష్టాపన మహోత్సవం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది.కాగా స్వామివారి విగ్రహాన్ని డప్పు చప్పుళ్ళు మహిళల మంగళ హారతులతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రతిష్టించారు.అంతకు ముందు పేద పండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు జరిపించి లక్ష్మీ నరసింహ స్వామి శాంతి కళ్యాణం జరిపించారు.కాగా టిపిసిసి నాయకుడు కృష్ణారావు,బిజెపి మండల శాఖ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి,మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ లను గ్రామ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి ఆధ్వర్యంలో కాపు సంఘం నాయకులు షాలువలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గ్రామస్తులున్నారు.

## ఘనంగా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు బలమేల కార్యక్రమం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట, ఓడేడు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మచ్చుపేట గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్, ఓడేడు సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డికి అంగన్వాడీ సిబ్బంది, మహిళలు సాంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించారు.అనంతరం చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం బలమేల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్ కళావతి, ఉప సర్పంచ్ దొంతుల రాకేష్, దాసరి ప్రశాంత్ గౌడ్,ఎంఎల్ హెచ్ పి దీప్తి, ఏఎన్ఎం పుష్పలత, ఆశ కార్యకర్తలు,అలాగే వార్డు సభ్యులు బందరపు సాగర్, దుండే జ్యోతి రాణి, కలవేన దేవరాజ్, ఏఎల్ఎంఎస్ కమిటీ సభ్యులు బాణాల కవిత, అలిశెట్టి సౌజన్య, ఈ వేడుకలో పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బోర్ ఏర్పాటు

ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ : మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ గర్మిళ్ళ 12వ డివిజన్‌లో ప్రజలకు నీటి సమస్య తీర్చడానికి రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ వేయించారు. ప్రజల అవసరాలకోసం మాట ఇచ్చినట్టుగానే తాము బోర్‌వెల్ వేయించి ఉపయోగించుకునే విధంగా అన్నమాటను నిలబెట్టుకున్నట్లు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఈ సందర్భంగా బోర్‌ను ప్రా రంభించి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బిజెపి అభ్యర్థులను గెలిపించిన నేపథ్యంలో ఈ డివిజన్‌లో బోర్‌వెల్ ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కస్తూరి నాగరాజు, బొ ట్ల అనిత, అమిరిశెట్టి రాజ్‌కుమార్, రంగ శ్రీ శైలం, జోగుల శ్రీదేవి, ఆకుల అశోక్‌వర్ధన్ త దితరులు పాల్గొన్నారు.

## కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ : మంచిర్యాల జిల్లాలో మే 1వ తేదీన కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా జిల్లాలోని కలెక్టర్ భవన సముదాయంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న వేడుకలకు కార్మికులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు జిల్లాలోని మండలాలల్లో జరిగే వివిధ కార్యక్రమాలను ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ : మంచిర్యాల జిల్లా యువజన , క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. గురువారం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో సమ్మర్ కోచింగ్ క్యాంపుల గోడప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో కోచింగ్ క్యాంపుల ఏర్పాటు ద్వారా పిల్లలకు, క్రీడాకారులకు ఆసక్తి బట్టి శిక్షణ ఇచ్చిన నిష్ణాతులను చేయవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వివిధ క్రీడా శిక్షణ కేంద్రాలు ప్రారంభించబడినావని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఎటిజి) మార్గదర్శకాల మేరకు ఈ ఉచిత కేంద్రాలు ఏప్రిల్ 24 నుండి జూన్ 07 వ తేదీ వరకు నిర్వహించబడుతాయని తెలిపారు.

# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



ప్రజాపక్షం / జన్నారం:మండలంలోని రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం బాధ్యతగా కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, ఉప సర్పంచ్ అప్పల జలపతి, గోలి చందు, బద్రి నాయక్, పవన్, కృష్ణ, రవి పాల్గొన్నారు.

# జనాభా గణన వివరాల నమోదులో పొరపాట్లు ఉండకూడదు

### రాష్ట్ర ప్రభుత్వ పరిశీలకులు కృష్ణయ్య



ప్రజాపక్షం / మందమర్రి:జనాభా గణన ప్రక్రియలో ప్రతి ఇంటికి చేరుకుని ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పరిశీలకులు కృష్ణయ్య ఎన్యూమరేటర్లను ఆదేశించారు. దేశ అభివృద్ధికి పునాది అయిన జనాభా గణనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మందమర్రిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, కార్మెల్ స్కూల్‌లలో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాలను ఆయన సందర్శించి ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు మార్గదర్శకాలు అందించారు. కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని కృష్ణయ్య సూచించారు. దేశ భవిష్యత్ ప్రణాళికలు, విద్యా, ఆరోగ్య, ఉపాధి రంగాల అభివృద్ధికి ఈ గణన మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు, ప్రజల అవసరాల అంచనాకు ఈ ప్రక్రియ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. సిబ్బంది బాధ్యతగా పని చేసి జనాభా గణనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాయలింగు పాల్గొన్నారు.

# పరీక్షా ఫలితం భవిష్యత్తును నిర్ణయించదు

### ఎస్ఐ ఉదయ్ కిరణ్



ప్రజాపక్షం /జన్నారం:పదవ తరగతి ఫలితాల నేపథ్యంలో విద్యార్థులు నిరాశకు లోనుకావద్దని, ఒక పరీక్ష ఫలితం భవిష్యత్తును నిర్ణయించదని జన్నారం ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ అన్నారు. ఫలితాలు విడుదలైన సందర్భంగా ఆయన విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో ఆశించిన మార్కులు రాకపోయినా, విఫలమైనా అది జీవితానికి అంతం కాదని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. జీవితంలో విజయానికి అనేక మార్గాలు ఉన్నాయని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ఎస్‌ఐ సూచించారు. విద్యార్థులు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా లక్ష్యం వైపు సాగాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచకుండా వారికి మానసిక బలాన్ని అందించాలని, ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తీవ్ర నిరాశలో ఉన్న విద్యార్థులు వెంటనే పోలీసులను లేదా కౌన్సెలింగ్ కేంద్రాలను సంప్రదించాలని ఆయన తెలిపారు. మనోధైర్యంతో ముందుకు సాగితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు.

# నేతకాని కులాన్ని విస్మరించడంపై ఆగ్రహం



ప్రజాపక్షం/జన్నారం:జనాభా గణాంకాల్లో నేతకాని కులాన్ని విస్మరించడాన్ని నిరసిస్తూ ఆ కుల బాధ్యులు జన్నారం తహసీల్దార్ బక్కయ్యకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్‌సి కులాల వారీ జనాభా వివరాల్లో నేతకాని కులాన్ని చేర్చకపోవడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసన చేపట్టారు. ఎస్‌టి చైర్మన్, రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ నేత మాట్లాడుతూ జనాభా లెక్కల్లో కులాన్ని విస్మరించడం కుట్రపూరిత చర్య అని ఆరోపించారు. నేతకాని కులస్తులు ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ప్రసాద్ నేత పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. తాహసీల్దార్ స్పందిస్తూ వినతిపత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్, మహమ్మదాబాద్ సర్పంచ్ రామటంకి శంకర్, మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, జాడి వెంకట్, దుర్గం వినోద్, దుర్గం వసంత్, సిఐటియు నాయకులు కూకటికారి బుచ్చయ్య పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



ప్రజాపక్షం/ఆర్మూర్:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను మండలంలోని ఖానాపూర్ గ్రామంలో పూర్తిస్థాయిలో నిర్మించిన ఇందిరమ్మ లబ్ధిదారుని ఇల్లును గురువారం సర్పంచ్ బోదాసు నర్సింలు ఉపసర్పంచ్ రాజనర్సయ్య చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. గృహప్రవేశం చేసుకున్న ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలిపి మరో విడతలో ఇల్లు లేని పేదవారికి కూడా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయటం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ మా కలను నెరవేర్చినందుకు ప్రజాపాలన ప్రభుత్వానికి సిఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, కారోబార్ సుజాత పాల్గొన్నారు.

## నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంబం

ప్రజాపక్షం / కౌటాల:కౌటాల మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గురుడ్‌పేట్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం కానుంది. మే 1వ తేదీ ఉదయం 11 గంటలకు కౌటాల శివాలయం వెనుక ఉన్న ఏఎంసి గోదాంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం కార్యదర్శి తెలిపారు. రైతులు తాము పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన ధర పొందేందుకు పంటను శుభ్రపరచడంతో పాటు బాగా ఆరబెట్టి తీసుకురావాలని కోరారు. స్థానిక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ సాగుతుందని వెల్లడించారు. ఈ కేంద్రం ప్రారంభం కానుండటంతో మండలంలోని మొక్కజొన్న సాగు రైతులకు విక్రయ సౌకర్యం కలగనుంది.

## మే 6న మండల స్థాయి సమావేశం

ప్రజాపక్షం / మందమర్రి:మందమర్రి మండలంలో ఎస్‌సి కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సర లక్ష్యాల సాధనపై మే 6వ తేదీన సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. మండల స్థాయి కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక, ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన, బ్యాంకులతో సమన్వయం తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అర్హులైన వారిని గుర్తించి వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపికైన లబ్ధిదారుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలను పాటిస్తూ సబ్సిడీల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రజా పరిషత్ అధికారులు కోరారు.

## ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

### మెరిట్ విద్యార్థులు సైకిళ్ళు పంపిణీ చేసిన రఘునాథ్

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని నిన్న వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సైకిళ్ళను అందజేశారు. గురువారం మంచిర్యాల గర్మిళ్ళ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన ఫాతిమాకు పదివేల రూపాయల నగదు బహుమతి, రెండు మూడు స్థానాల్లో నిలిచిన పూజిత, వైష్ణవి విద్యార్థినీలకు సైకిళ్ళు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే ఈ ఫలితాలు వచ్చాయని ఇప్పటి నుండే ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు తాము ఎల్లపుడు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పోరేటర్లు కస్తూరి నాగరాజు, బొట్ల అనిత, బిజెపి నాయకులు అమిరిశెట్టి నాగరాజు, ర

## ఘనంగా శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కళ్యాణోత్సవం

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం, ప్రథమ జాతరోత్సవాలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, హోమం, బలిహరణం నిర్వహించారు. ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులను పూలతో అందంగా అలంకరించిన కళ్యాణ వేదిక వద్దకు డప్పుచప్పుల మధ్య ఊరేగింపుగా తీసుకవచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మల్యాల సుభాష్‌గౌడ్, పన్నాల రవీందర్, సింగిరెడ్డి భరత్‌రెడ్డి, పెద్దకిషన్, కిషన్, మహేష్, భూమేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

## టాపర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని ఉప్లూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన సిరిగిరి షాలిని 568, కృష్ణశ్రీ 517, నవీన 515 మార్కులు సాధించిన విద్యార్థులకు ఉప్లూర్ సర్పంచ్, ఎంఈఓ ఆంధ్రయ్య, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు వేణుగోపాల్ యాదవ్‌లు ఘనంగా సన్మానించ ఇమాట్లాడారు. షాలిని జడ్పీహెచ్ఎస్ ఉప్లూర్‌లో చదివి ఉత్తమ ప్రతిభ కనబర్చి 568 మార్కులు సాధించిన మండల టాపర్‌గా నిలవటం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్ యాదవ్, సదానంద, సల్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లలు వాహనాలు నడిపినా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/మోర్తాడ్:**గ్రామాల్లో పట్టణాల్లో చిన్న పిల్లలు ద్విచక్ర వాహనాలను నడిపితే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఒక దిక్కు ఆదేశిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని పాదాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రస్తుతం అన్ని గ్రామాలలో ప్రభుత్వం పాఠశాలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులంతా ఇళ్లకు చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో పాఠశాలలకు సెలవులు రావడంతో అందులో చిన్న పిల్లల సైతం వారి వారి ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను తీసుకొని రోడ్లపై సర్రుమని, బుర్రుమని, వాహనాలు తీసుకొని రోడ్లపై బయలు దేరుతున్నారు. దీంతో రోడ్లపై నడిచే బాటసారులకు గాని వాహనాలపై వెళ్లే వారికి గాని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు శిక్షలు విధిస్తామని గతంలో పోలీసు అధికారులు కూడా తెలిపారు. కానీ మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్న పిల్లలు ప్రతినిత్యం వాహనాలు నడిపిస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం ప్రతినిత్యం రోడ్ల వెంబడి వాహనాలపై వస్తున్న ప్రజలను ఆపి మీరు మద్యం సేవించి వస్తున్నారా..? లేదా..? అని ఓ ప్రత్యేక యంత్రంతో గాలి ఊదమని పరీక్షిస్తున్నారు. వాహనాలు నడిపే వారం మద్యం సేవించినట్లు సాయంత్రం దుర్కరించినట్లయితే వారికి ఫైన్ లు వేస్తున్నారు. కానీ చిన్న పిల్లలు నడిపే వాహనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, తెలిసి కూడా చూస్తూ ఊరుకుంటున్నారని స్థానిక ప్రజల ఆలోచిస్తున్నారు. ఏది ఏమైనా చిన్న పిల్లలు నడిపే వాహనాల వల్ల ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకముందే రవాణా శాఖ అధికారులు కాని పోలీస్ అధికారులు కానీ కట్టడి చేసి పిల్లల వల్ల ఎవరికీ ఎటువంటి హానీ కలుగకుండా చర్యలు తీసుకోవాలని రవాణ శాఖ అధికారులకు పోలీస్ అధికారులకు మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహిళలు ఉచిత మగ్గం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### ఆర్‌బిఐ ఎల్‌డిఓ యశ్వంత్ సాయి



**ప్రజాపక్షం / దండేపలి:**మహిళలు, యువతులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత మగ్గం వర్క్ శిక్షణను ఉపయోగించుకోవాలని ఆర్బీఐ ఎల్డీఓ యశ్వంత్ సాయి పిలుపునిచ్చారు. దండేపల్లి మండల కేంద్రంలో గురువారం గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటిఐ) ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన వస్త్ర చిత్రకళ లఘు ఉద్యమి (మగ్గం) శిక్షణను ఎల్డీఎం తిరుపతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఇటువంటి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మొదటి విడతగా 70 మంది మహిళలతో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు యశ్వంత్ సాయి వెల్లడించారు. శిక్షణ పొందే మహిళలకు ఉచిత భోజన సౌకర్యం కల్పించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఆర్ఎస్ఈటిఐ ద్వారా అందించే వివిధ ఉపాధి కోర్సులను నేర్చుకుని భవిష్యత్తులో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారుఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ ఆశిష్, కోర్స్ కోఆర్డినేటర్ దాసరి రమాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రాజేశ్వరరావు, సర్పంచ్ నాగు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో మహిళలు,చిన్నారుల భద్రతపై అవగాహన

### షీ టీమ్ ఇన్చార్జ్ బిక్కులాల్




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:**ఆసిఫాబాద్ లోని అంగన్వాడీ కేంద్రాలు, మార్కెట్ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల భద్రతపై షీ టీమ్, ఏహెచ్‌టీయూ బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రజా పాలన – ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రవిచంద్ర కాలనీ, బజార్ వాడి అంగన్వాడీ సెంటర్లలో ప్రజలకు రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్ ఇన్చార్జ్ ఎస్సై బిక్కులాల్ మహిళల భద్రత, లింగ సమానత్వం, సైబర్ నేరాల నివారణపై వివరించారు. చిన్నారుల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం పొందేందుకు సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు, చట్టపరమైన రక్షణల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లైలా, పెంటు బాయ్, షీ టీమ్ సిబ్బంది స్వప్న, రజిని, వరలక్ష్మి, దినేష్ పాల్గొన్నారు.

# న్యాయ సేవా సాధికార సంస్థకు పిఎల్ వీలే కీలకం

### తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటి మెంబర్ సెక్రెటరీ సిహెచ్ పంచాక్షరి



**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :**జిల్లా న్యాయ సేవా సాదికార సంస్థ కి ఉచిత న్యాయసేవకులు లే కీలకమని, సమాజంలోని అట్టడుగు ప్రజలకు న్యాయ సేవలను అందించుటకు న్యాయ సహాయ సేవకులు ప్రధాన భూమిక వహిస్తారని వీరి సేవలను వెలకట్టలేమని తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటి మెంబర్ కార్యదర్శి హైకోర్టు న్యాయమూర్తి చిలకమూరి పంచాక్షరి అన్నారు. గురువారం నిజామాబాద్ కోర్టు సముదాయం లోని కార్యాలయంలో జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న న్యాయ సేవలను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు చేరాలన్న ప్రధాన లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో న్యాయ సేవా సాధికార సంస్థ పనితీరును తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ పరిపాలన అధికారి శైలజ, డిఎల్ఎస్ఏ సిబ్బంది, పిఎల్ విలు, ప్యానెల్ అడ్వకేట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరో అవకాశం

**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :**జిల్లాలోని ప్లాట్ల యజమానులకు తెలంగాణ ప్రభుత్వం (ఎల్ఆర్ఎస్)కు మరోఅవకాశం కల్పించింది. పెండింగ్‌లో ఉన్న లే అవుట్ క్రమబద్దీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) ఫీజుల చెల్లింపులపై ఏకంగా 25 శాతం భారీ రాయితీని ప్రకటించిందని నిజామాబాద్ నగర మేయర్ కె. ఉమారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుదవారం కీలక ఉత్తర్వులు జారీచేసిందని, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ మేరకు జీవో నెంబరు 131 ను విడుదల చేశారన్నారు. ఎల్ఆర్ఎస్ 2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు ఈ వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం 2026 మే 1 నుంచి జులై 31వ తేదీ వరకు మూడు నెలల కాలంలో ఫీజు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. సాధారణ మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా పెద్ద ఊరటనిస్తూనే, ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అరుదైన అవకాశాన్నిప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకొని తమ ఆస్తులను క్రమబద్దీకరించుకోవాలని కోరారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వేల సంఖ్యలో ఉన్నప్లాట్ల యజమానులకు బారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని తెలిపారు.

# లక్ష్మీ నారాయణ ప్రమాణస్వీకారానికి ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలి

**ప్రజాపక్షం/ఎడపలి:**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ ప్రమాణ స్వీకారం మే 2న హస్తినాపూర్‌లోని బిఎస్ఆర్ కన్వెషన్‌లో నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి నీల భాస్కర్ గుప్తా తెలిపారు. మే 2 శనివారం ఉదయం 10.30గంటలకు ప్రమాణ స్వీకారం జరగనున్నట్లు ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లాలోని ఆర్యవైశ్యులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రమాణ స్వీకార కార్యక్రమా



నికి తెలంగాణ రాష్ట్రంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, ముఖ్య అతిథులు పెద్ద ఎత్తున హాజరవుతున్నందున ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## దొండ్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం

**ప్రజాపక్షం / తిర్యాణి:**తిర్యాణి మండలంలోని దొండ్ల గ్రామంలో నెల కొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ మడావి పార్వతి పరిష్కరించారు. ఎదులపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఈ గ్రామంలో తాగునీటి ఎద్దడిని గమనించిన ప్రజలు బోర్ వద్ద మోటార్ బిగించాలని కోరగా సర్పంచ్ తక్షణమే స్పందించారు. గురువారం నూతన మోటార్‌ను ఏర్పాటు చేయించి గ్రామానికి నీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామ ప్రజల అవసరాలను తీర్చడంలో ఎల్లప్పుడూ ముందుంటానని, ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తాగునీటి ఇబ్బందులు తొలగిపోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు మోతుబాయి, మాజీ ఎంపీటీసీ కోట్నాక యశ్వంత్ రావు, రాయిసెంటర్ సర్మేడి, మడావి అంబారావు, మడావి మధుకర్, నెహ్రూ, గ్రామ పటేల్ బొజ్జిరావు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలంటూ వినతి



**ప్రజాపక్షం/బాల్కొండ:**విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్ ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుండటంతో ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సర్పంచ్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఎమ్మెల్యే నిధుల నుండి బస్సు షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నవీన్, రాజేందర్ పాల్గొన్నారు.

## వరి, చెరుకు పరిశోధనపై అవగాహన

**ప్రజాపక్షం/ముప్కాల్:**మండలంలోని రెంజర్ల గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రాంతీయ వరి, చెరుకు పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య రాథోడ్ ఆధ్వర్యంలో రైతులకు రాబోయే వానకాలం సాగుకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించామని మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ తెలిపారు. వాటిలో భాగంగా భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని, యూరియా వంటి నైట్రోజన్ ఎరువులను అధికంగా వాడకూడదని సిఫారసు చేసిన మోతాదులోనే కీటక నాశకాలు వాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య భూమేష్, సీఈఓ గంగాధర్, రైతులు చిన్నారెడ్డి, లింగారెడ్డి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

## జాన్కంపేట్‌లో వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జన్మోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని చారిత్రక జాన్కంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారి జన్మోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం స్వామి వారికి అర్చకులు శాస్త్రోక్తంగా చందన అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5.30గంటలకు స్వామి వారికి ప్రత్యేకంగా పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామి వారి జన్మోత్సవ వేడుకల్లో భాగంగా ఊంజల సేవ నిర్వహించడం జరిగిందని ఈఓ వేణు తెలిపారు. ఈ జన్మోత్సవ వేడుకలు పురస్కరించుకొని దేవస్థానాన్ని రంగు రంగుల పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. పూల పరిమళాలు, అధ్యాత్మిక వాతావరణంలో జాన్కంపేట్ క్షేత్రం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. ఈ వేడుకలను వీక్షించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.